# “దేవుడు ప్రేమయైయున్నాడు”

హెచ్చ్. ఎ. డిక్షన్

“దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను ఆరాధించవలెను” అని ప్రభువైన యేసు సమరయ స్త్రీకి ప్రకటించాడు (యోహాను 4:24). ఈ ప్రతిపాదనలో దేవుడు ఒక వ్యక్తియని క్రీస్తు ప్రభువు ప్రకటించారు. ఆయన ఆత్మ – అంటే, నిజమైన ఒక (Being) వ్యక్తి, కాని పూర్తిగా పదార్థ రహితమైనవాడు. ఆయన ఆత్మ – అంటే, ఆయనను స్పృశించి తెలిసికోదగినది ఏమీ ఉండదు. ఆయన తాకబడడు సరికదా, మర్త్యమైన నేత్రాలతో ఆయన చూడబడడు. ఆయన ఆత్మ, అయినా ఆయన నిజమైనవాడు. ఆయన వ్యక్తిగతమైన దేవుడైయున్నాడు.

1 యోహాను 1:5లో, “దేవుడు వెలుగైయున్నాడు, ఆయనలో చీకటి ఎంతమాత్రమును లేదు” అని అపొస్తలుడైన యోహాను అన్నాడు. దేవుడు వివేకముగల వ్యక్తియై యున్నాడని దైవప్రేరేపితుడైన ఈ లేఖకుడన్నాడు. ఆయన ఒక వెలుగు కాదు, కాని “ఆయన వెలుగై యుండెను.” ఆయన స్వభావమే వెలుగు. వివేక పరంగా అది దైవికమైన ఎసెన్స్ (సారం). వెలుగు అనేది దేవుని యొక్క గుణ లక్షణం కాదు, అది దేవుడే. “దేవుడు జ్యోతిర్మయుడు” (Father of lights) అని యాకోబు ప్రకటించాడు (యాకోబు 1:17). “సమీపింపరాని తేజస్సులో ఆయన మాత్రమే వశించుచు” అని పౌలు తెలిపాడు (1 తిమోతి 6:16).

1 యోహాను 4:8లో దేవుని స్వభావాన్ని గూర్చి ఒక గంభీరమైన ప్రతిపాదన చేయబడింది: “దేవుడు ప్రేమయై యున్నాడు; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు.” వెలుగువలెనే ప్రేమ అనేది కేవలం దేవునియొక్క విశేషణం కాదు. అది ఆయన స్వభావం. “దేవుడు వెలుగైయున్నాడు” అనేది దేవునియొక్క వివేకపు స్వభావాన్ని సంగ్రహపరచు తున్నట్టు “దేవుడు ప్రేమయైయున్నాడు” అనేది దేవునియొక్క నైతిక స్వభావాన్ని సంగ్రహపరచుతుంది. మనోజ్ఞము (రమ్యత), శక్తి, న్యాయము అనేవాటిని ఎరుగకుంటే, ఆయనను గూర్చిన అనేక విషయాలు ఎరిగియున్నా, ఆయనను గూర్చిన అతని జ్ఞానము పరిమితియైనదై ఉంటుంది. అదే విధంగా, ప్రేమను గూర్చిన భావనను ఎరుగనివాడు దేవుని ఎరుగలేడు. ప్రేమ దేవుని మూలంగా కలిగింది ఎందుకంటే దేవుడు ప్రేమయై ఉన్నాడు. అప్పుడు, దేవుడు, ఆత్మ, తనదైన వ్యక్తిత్వం గలవాడు (personal Being); ఆయన వెలుగైయున్నాడు, వివేకముగల వ్యక్తి (Being); మరియు ఆయన ప్రేమయై ఉన్నాడు, సన్మార్గపు వ్యక్తియై (Being)యున్నాడు.

కొంతవరకు ఒకరియెడల ఒకరికున్న స్వభావాన్ని లేక తత్వాన్ని దిద్దడానికి యోహాను తన తొలి పత్రికను క్రైస్తవులకు వ్రాశాడు. ఈ పుస్తకం యొక్క ప్రధాన భారాల్లో ఒకటి సహోదర ప్రేమయొక్క ప్రాముఖ్యతను నొక్కి పలకడం. 1 యోహాను 4:7, 8ల్లో మనం యిలా చదువుతాం, “ప్రియులారా, మనము ఒకనినొకడు ప్రేమింతము; ఏలయనగా

ప్రేమ దేవుని మూలముగా కలుగుచున్నది; ప్రేమించు ప్రతివాడును దేవుని మూలముగా పుట్టినవాడై దేవుని ఎరుగును. దేవుడు ప్రేమయై యున్నాడు; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు."

ఒకనిపట్ల మరొకనికి ప్రేమ కలిగి ఉండడమనేది క్రైస్తవ్యంలోని ప్రత్యేకత. ఈ ప్రేమ ఎక్కడ ఉంటుందో అతడు దేవుని బిడ్డ అనడానికి అక్కడ నిదర్శనముంటుంది. "దేవుని మూలముగా పుట్టిన ప్రతివాడును దేవుని ఎరుగును" ప్రేమ లేకుండ, కుమారత్వానికి ఎవనికిని క్లెయిమ్ ఉండదు. (ప్రేమ లేకుండ కుమారుడని చెప్పుకునే వీలుండదు) భూసంబంధమైన తన తండ్రి స్వభావాన్ని బిడ్డ ఎలా పంచుకుంటాడో, ఆత్మసంబంధమైన బిడ్డ ఆత్మసంబంధమైన తన తండ్రి స్వభావాన్ని పంచుకుంటాడు. తండ్రి ప్రేమయై యున్నాడంటే, అతని సంబంధియని చెప్పుకునే ప్రతివాడును ఆయన ప్రేమలో భాగ స్వామియై యుండాలి. దేవునిలో ప్రేమ భాగమైయున్నట్టే తనయందును ప్రేమ భాగమైయుండాలి.

## దేవుని ప్రేమ నరునికి కనుపరచబడింది

మానవుని మనస్సు దేవుణ్ణి సంపూర్ణంగా ఎన్నడూ గ్రహించజాలదు. వాని కన్నులు దేవుని చూడజాలవు. అతని చేతులు దేవుని తాకి చూడలేవు. అతని మనస్సు దేవునిని అన్వేషించలేదు. దేవుడు తన స్వభావాన్ని, తన గుణగణాలను నరునికి బయలుపరచాడు, అయినా వీటిలో ఏదియు మర్త్యుడైన మానవుని కలంచేత వాని మాటలచేత వర్ణింప వీలుపడదు. ఈ వాస్తవంచేత ఒప్పింపబడి, ఒక కవి ఈ పంక్తులను వ్రాశాడు:

సిరాగా సముద్రమే చాలుతుందా,
ప్రతి గడ్డిపోచ ఒక ఈకగా మారి,
లోకమే కాగితంగా తయారైతే
వృత్తినిబట్టి ప్రతి మనిషి లేఖకుడైతే
పైనున్న దేవుని ప్రేమను వ్రాయడానికి
సముద్రము ఎండిపోయేలా ఖాళీయౌతుంది
మొత్తాన్ని ఆ చర్మపు చుట్ట పట్టుతుందా
ఆకాశంనుండి ఆకాశంవరకు సాగదీసినా.[1]

పరిమితుడైన నరమాత్రుడు అపరిమితుడైన దేవుని మనస్సును, ఆయన శీలాన్ని గ్రహించుకొనలేడు. అందునుబట్టి, వాస్తవాన్ని, దేవుని స్వభావాన్ని గూర్చి నేర్చుకొనడానికి గాను, వాడు దేవుని ప్రత్యక్షతలపై ఆధారపడియుండాలి. "ఆయన అదృశ్యలక్షణములు, అనగా ఆయన నిత్య శక్తియు దేవత్వమును జగదుత్పత్తి మొదలుకొని సృష్టింపబడిన వస్తువులను ఆలోచించుటవలన తేటపడుచున్నవి ...." అని పలికిన పౌలుతో కలిసి మనం అనడం తగియుంటుంది (రోమా 1:20). ఈ ప్రతిపాదన ప్రత్యేకించి దేవత్వానికి, శక్తికి సంబంధించింది, అయితే ఆయన ప్రేమ విషయంలోను యిది వాస్తవమై

యుంటుంది. ఆయన ప్రేమను మనం చూడలేం, కాని దైవికమైన కనికరము, దయ, జాలి, నరునియెడల ఆయనకున్న కరుణ అనే తన కార్యముల ద్వారా మనం నేర్చుకోగలం.

మానవునియెడల తన ప్రేమను దేవుడు తన సృష్టియొక్క సమస్త కార్యాలలో కనపరచాడు. దేవుడు లోకమును నివాస యోగ్యముగా చేసినట్టు ప్రవక్తయైన యెషయా చెప్పాడు (యెషయా 45:18). దేవుడు లోకాన్ని తన ప్రేమకు గురియైనవాని నివాస యోగ్యంగా చేశాడని దీనిని సరిగా వ్యాఖ్యానించవచ్చు. దేవదూతలకంటె కొంచెము తక్కువవానిగా చేయబడిన నరుని దేవుడు దర్శించాడు (హెబ్రీ. 2:6, 7).

ఈ నివాసమందు, మానవ ఉనికికి అవసరమైన జీవులను ప్రేమమయుడైన దేవుడు దయచేయడం మాత్రమే గాక, వానికొక సాటియైన సహాయం, తన అవసరతలను పూరించుటకు ప్రసాదించాడు. మర్త్యులగు వారి మధ్య ఎరుకైన బహు సన్నిహితమైన బాంధవ్యంతో నరుని తన సాటియైన సహాయముతో జతచేశాడు, అది, తన భార్యపట్ల పురుషుని ప్రేమ. ఈ బాంధవ్యం, నరునికి గృహాన్ని ప్రేమించువారిని ప్రసాదించింది, మరియు నిజమైన ప్రేమ యుగములలో తరములలో నిలిచియుండేలా అది ఆధారంగా రూపొందింది. నిజమైన దేవుని బిడ్డయొక్క గృహాన్ని నింపేదానికంటె తియ్యని ప్రేమయొక్క ముఖ వైఖరి యిక ఎక్కడను కన్పించదు.

పదార్థ సంబంధమైన విశ్వంలో దేవుని ప్రేమ ప్రతిఫలింపజేయబడింది. ఏదెను తోటలో ఆదర్శమైన పరిస్థితులయందు ఆయన వానిని నిలిపాడు. మానవుడు పాపం చేసి, తోటనుండి తరిమివేయబడినప్పుడు సహితం, దేవుడు తన ప్రేమను బయలు పరచాడు. భూమి శపింపబడినా, మానవ ప్రయాసంతోను శ్రమ జీవిగా బ్రతుకవలసి వచ్చినా, ఫలవంతములైన రుతువులను దయచేస్తూ విత్తు కాలము కోత కాలములను కాలాంతంవరకు అభయం యిచ్చాడు.

సమస్యలతో కూడిన లోకంలో, ఎన్నడు నరుడు తన మార్గాన్ని కనుగొనలేకపోయాడు. సమస్యలకు పరిష్కారాలు వానియందు లేవు. మరల, మనుష్యునికి ఉపదేశం అనుగ్రహించడంతో దేవుడు తన ప్రేమను కనుపరచాడు. ఆయా సందేశాల ద్వారా దేవుడు తన్ను తాను బయలుపరచుకున్నాడు. చీకటిని పారద్రోలడానికి వెలుగును, నరునికి త్రోవ చూపే ఆలోచనను ఆయన అనుగ్రహించాడు. అలాటి ఆలోచన, ఉపదేశమే "గ్రంథములకు గ్రంథమును" రూపించింది. బైబిలు దేవుడు ప్రేమయైయున్నాడనడానికి రుజువుగా ఉంది.

మానవ పాపమునకు పరిహారం ప్రసాదించాడనే వాస్తవంలో దేవుని ప్రేమయొక్క అతి గొప్ప రుజువు కన్పిస్తుంది. బైబిలుయొక్క "సువర్ణ మూల వాక్యముగా" యోహాను 3:16 వర్ణింపబడింది. అది తగిన వర్ణనే, ఎందుకంటే దేవుని ప్రేమయొక్క విస్తీర్ణానికి అది సార సంగ్రహమైయుంది. దేవుడు లోకమును ఎంతో ప్రేమించి మనకు బదులు తన కుమారుడు చనిపోయేలా ఆయనను అనుగ్రహించాడు. "ఆయన మన నిమిత్తము తన ప్రాణముపెట్టెను గనుక దీనివలన ప్రేమ యెట్టిదని తెలిసికొనుచున్నాము" అని యోహాను తెలిపాడు (1 యోహాను 3:16ఎ). మానవాళిపట్ల దేవుని ప్రేమయొక్క నాలుగు పరిమాణాలు కల్వరి సిలువలో స్పష్టంగా కన్పిస్తాయి. మన ఆత్మలపట్ల ఆయనకున్న

అక్కర యొక్క పొడవు, వెడల్పు, లోతు, ఎత్తు ఎంతో అది చూపుతోంది.

భూమిమీద దేవుని కుటుంబం యొక్క సహవాసము, సంతోషములనేవి దేవుని ప్రేమ యొక్క మరొక ప్రత్యక్షతయై ఉంది. దేవుని సంఘంగా సమకూర్చబడిన వారి కందరికి ఈ సహవాస భాగ్యముంటుంది. ఇందులో ఆయన ప్రజలు ఆయన దీవెన లన్నిటిలో పాలుపొందుతుంటారు. ఆయన సంఘాన్ని ప్రేమించి యిది సాధ్యమయ్యేలా తన కుమారుని అనుగ్రహించాడు. ఆ కుమారుడు సంఘమును ప్రేమించి దాని పరిశుద్ధపరచి పవిత్రపరచుటకై దానికొరకు తన్ను తాను అప్పగించుకొని, దేవుని ఆత్మయొక్క నివాసానికి అనుకూలమైన స్థలంగా దానిని చేశాడు.

దేవుని ప్రేమకు చివరి గుర్తుగా, సమాధిని దాటిన జీవితాన్ని గూర్చిన నిరీక్షణకు దృష్టిని మల్చుదాం. ప్రేమామయుడైన తండ్రియొక్క వాగ్దానాలవలన యిది మానవ హృదయంలో ప్రేరేపింపబడుతుంది, మరియు ఈ ఉద్దేశమే నీతిగా మనిషి జీవించడానికి హేతువైయుంటుంది. నిత్యత్వంలోనికి అడుగుపెట్టడానికి ఈ జీవితం కేవలం మెట్టుగా ఉందనే విశ్వాసం, నిత్య మహిమయొక్క నిరీక్షణ పరదైసులోనికి దూసికొనిపోతూ, దేవునిలా బ్రతకడానికి బలమైన కోర్కెలను రేపుతోంది. శరీరముయొక్కయు మనస్సుయొక్కయు బాధలను భరించుతూ, వేదించే జీవిత సమస్యలగుండా సహించుకొంటూపోయేలా ఈ నిరీక్షణ సహాయపడుతుంది. జీవమునకును భక్తికిని కావలసిన దీవెనలన్నిటిని దేవుడు ప్రేమతో ప్రసాదించాడన్న వాస్తవానికి మన నిరీక్షణ మరొక రుజువైయుంది.

## దేవుని ప్రేమకు మానవ ప్రత్యుత్తరం

మానవుని వద్దనుండి ప్రేమయొక్క స్పందనను పొందడానికి దేవుడు నరునియెడల తన ప్రేమను కుమ్మరించాడు. "ఆయనే మొదట మనలను ప్రేమించెను గనుక మనము ప్రేమించుచున్నాము" అని యోహాను అన్నాడు (1 యోహాను 4:19). ఆయనను ప్రేమించడం అంటే, ఆయన ప్రేమించిన వారిని ప్రేమించడం; దేవుని ప్రజలపట్ల క్రోధము దురుద్దేశము నిలుపుకొని మనం దేవుని ప్రేమిస్తున్నామని తలంచడం బొత్తిగా అపార్థం చేసికొనడమే. అపొస్తలుడైన పౌలుయొక్క భాషలో, "ఒకడు తనకంటె యోగ్యుడు" అనే భావంతో ప్రతి క్రైస్తవుడు తన ప్రేమను దేవుని ప్రజలకు కనుపరచాలి (ఫిలిప్పీ. 2:3).

ప్రేమను సేవలోనికి తర్జుమా చేయాలి. ప్రేమ ద్వారా పనిచేసే విశ్వాసమే దేవుని యెదుట అంగీకారం పొందేది. "మీరు నన్ను ప్రేమించినయెడల నా ఆజ్ఞలను గైకొందురు" అని ప్రభువైన యేసు అన్నారు (యోహాను 14:15). అందువలన, ప్రేమ సేవనుండి వేరుచేయబడదు; దేవుని ప్రజలపట్ల ఉన్న ప్రేమ సేవ చేయడంలో బయలు పరచబడాలి. మనం మనుష్యులకు సేవచేయాలి. వారి భౌతికమైన అవసరతలపట్ల మనం మన కండ్లను చెవులను మూసికొనినట్లయితే, ఆత్మ సంబంధమైన ఆహారం విషయంలో ఎక్కువ మందికి ఆసక్తిని కలిగించలేం. ప్రభువైన యేసు "మేలుచేయుచు" సంచరించారు, ఆయన ప్రేమించినట్టు ప్రేమించేవారు ఆయన మాదిరిని అనుసరించాలి.

1 కొరింథీ. 13లో పలువురికి ఎరుకైన మాటలలో దేవుని ప్రేమయొక్క స్వభావాన్ని

పౌలు తెలియజేశాడు, దేవుని దాసుడు యిలా ప్రకటించాడు,

> ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజన మును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతివిషయమై సంతోషపడక సత్యమునందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును (4-7 వచనాలు).

ఈ వాక్య భాగము ప్రేమను గూర్చి వివరించడం మాత్రమే గాక – దేవుడు ప్రేమ గనుక – ఇది దేవుని గూర్చి కూడా వివరిస్తుంది. "ప్రేమ" అనే పద స్థలములో "దేవుడు" అనే పదాన్ని ఉంచి ఈ వాక్య భాగాన్ని చదివి చూడు:

> దేవుడు దీర్ఘకాలము సహించును, దయ చూపించును. దేవుడు మత్సరపడడు, దేవుడు డంబముగా ప్రవర్తించడు, ఆయన ఉప్పొంగడు అమర్యాదగా నడుచుకొనడు; స్వప్రయోజనమును వెదకడు, త్వరగా కోపపడడు, అపకారమును మనస్సులో ఉంచుకొనడు, దుర్నీతియందు సంతోషపడక సత్యమునందు సంతోషించును; అన్నిటిని తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును అన్నిటిని ఓర్చుకొనును.

దేవుని బిడ్డ దేవుని శీలము, ఆయన స్వభావము కలిగియుండవలసినవాడై ఉన్నందున, ఈ లేఖన భాగంలో తన పేరును ఆయనకు బదులుగా ఉంచుకొనగలగాలి అనేది విదితం. ఈ విధంగా దీన్ని మరల చదువుదాం:

> ఒక క్రైస్తవుడు దీర్ఘకాలము సహించును, క్రైస్తవుడు దయ చూపించును. క్రైస్తవుడు మత్సరపడడు; క్రైస్తవుడు అమర్యాదగా నడుచుకొనడు; క్రైస్తవుడు స్వప్రయోజనమును విచారించుకొనడు; క్రైస్తవుడు త్వరగా కోపపడడు; క్రైస్తవుడు అపకారమును మనస్సులో ఉంచుకొనడు. క్రైస్తవుడు దుర్నీతి విషయమై సంతోషపడక సత్యమందు సంతోషించును. క్రైస్తవుడు అన్నిటిని తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును.

చివరిగా, మనలో ప్రతి ఒక్కరం మనలను మనమే ఆ స్థానంలో ఉంచుకొని మరొకమారు చదువుదాం:

> నేను దీర్ఘకాలము సహింతును, నేను దయ చూపింతును, మత్సరపడను; నేను డంబముగా ప్రవర్తింపను, ఉప్పొంగను; నేను అమర్యాదగా నడుచుకొనను, స్వప్రయోజనమును మనస్సులో ఉంచుకొనను, త్వరగా కోపపడను, అపకారమును మనస్సులో ఉంచుకొనను, దుర్నీతియందు సంతోషపడక, సత్యమందు సంతోషింతును, అన్నిటిని తాళుకొందును, అన్నిటిని నమ్ముదును, అన్నిటిని నిరీక్షింతును; అన్నిటిని ఓర్చు కొందును.

తన పక్షంగా ఎవడును పూర్ణంగా దీనికి తగినవాడైనట్టు చెప్పుకోలేడు, అయినా శిష్యత్వానికి యిది నిజమైన పరీక్షయైయుంది. నిజంగా మనం దేవుని ఎరుగుదుమా?

దేవునికి ఉన్న స్వభావమే మనమును కలిగియున్నామా? జవాబు చెప్పేటప్పుడు, “దేవుడు ప్రేమయై యున్నాడు; ప్రేమలేనివాడు దేవుని ఎరుగడు” అని ఆయన చెప్పిన మాటలను జ్ఞాపకం చేసికొందాం (1 యోహాను 4:8); “మీరు ఒకనియెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలిసికొందురు” అని ప్రభువు చెప్పారు (యోహాను 13:35).

ప్రేమను గూర్చి పౌలు వర్ణనయొక్క ప్రాముఖ్యతను మనం ధ్యానించేకొలది, మానవుని స్వార్థపరమైన స్వభావాన్ని మనం గుర్తు తెచ్చుకుంటాం. తనకు తానే చాలినవాడైనట్టు భావించడానికి అతడు ఎలాంటి తత్వం కలిగియుంటాడో మనం జ్ఞాపకం చేసికొంటాం. తన కంటిలోని దూలాన్ని ఎంచక తన సహోదరుని కంటిలోని నలుసును వెదకడానికి తపనపడుతూ ఉంటాడో మనం గుర్తు చేసికోగలం (మత్తయి 7:3, 4; KJV చూడు).

ప్రేమలేని ఏ సద్గుణమును దేవునియెదుట మెప్పు పొందదన్న ఉపదేశాన్ని మనం ఎంఫసైజ్ (నొక్కి పలకడంలో) చేయడంలో తప్పి పోయామా? దేవుని ప్రజలకు కృపావరములు అనుగ్రహింపబడిన దినాల్లో, ప్రేమలేని తనంతో వారి క్రియలకు ఆయన యెదుట విలువ లేకుండ చేశాయి (1 కొరింథీ. 13:1, 2). ఆ వరములు దేవుని ఉద్దేశాన్ని సఫలం చేసిన పిమ్మట తీసివేయబడ్డాయి; యిప్పుడు విశ్వాసము, నిరీక్షణ, ప్రేమ అనేవి నిలిచిపోయాయి. “వీటిలో శ్రేష్ఠమైనది ప్రేమయే”నని పౌలు తెలియజేశాడు (1 కొరింథీ. 13:13). ఒకని విశ్వాసానికిని నిరీక్షణకును అర్థాన్ని, విలువను ప్రసాదించేది ఆ లక్షణమే. ఆ స్వభావాన్నిబట్టి మనం దేవుని సంబంధులమో కాదో తెలిసికోవచ్చు. దానినిబట్టి మనం నిజంగా ఆయన పిల్లలమో కాదో మనం తెలిసికొంటాం. దూరదేశంలో ఆయన సముఖమునకు తేబడినప్పుడు దీనిని బట్టియే మనం ఆయనను పోలి అతీతమైన ప్రదేశంలో ఉంటామో లేదో మనం తెలిసికుంటాం.

---

సూచనలు

[1]Frederick Martin Lehman, “The Love of God,” *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1996).

*Abilene Christian College Lectures*, 1958 నుండి ఈ పాఠం తిరిగి ముద్రించబడింది. Abilene Christian University Lectureship Director అనుమతితో యిది ఉపయోగించబడింది.